వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు




మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా శ్రీలక్ష్మీ శాంకరి శిష్యబృందం చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. వినాయకకౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, జయజయదుర్గే, నీలమేఘ శరీర, దశావతారం, హిందోళ తిల్లాన తదితర అంశాలను కళాకారులు లహరి, మనస్విని, సంజన, శరణ్య, కాజోల్, లిఖిత, శ్రీజ, కావ్య, తపస్య, సంప్రీతి తదితరులు ప్రదర్శించారు.

– మాదాపూర్

ఆకట్టుకున్న ధృతి నృత్య ప్రదర్శనలు





రాయదుర్గం: గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో కూచిపూడి నృత్య యువప్రజ్ఞాశాలి ధృతిముదిగొండ రంగప్రవేశ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నరాజమ్‌భజే, నమోనమోరఘుకుల నాయక, భామాకలాపం, దుర్గ తారంగం, అర్ధనారీశ్వరఅష్టకమ్ వంటి అంశాలపై ఆమె చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నట్వంగం ఉషాగోటేటి, ఓకల్ శ్వేతాప్రసాద్, మృదంగం రేణుకాప్రసాద్, వాయిలేన్ సాయికుమార్, ఫ్లూట్ జోగవఝ్జలదత్తాత్రేయ, వీణారాయప్రోలు సుధాకర్, స్పెషల్ ఎఫెక్ట్స్ వి శ్రీధారాచార్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అభినయ కూచిపూడి ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ గురు ఉషాగోటేటి, పద్యప్రచార పురస్కారగ్రహీత గట్టికృష్ణమూర్తి, రుషీపీఠం చారిటబుల్‌ట్రస్ట్ ఈసీ మెంబర్ ఎం సిద్దారెడ్డి, శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ కూకట్‌పల్లిజోన్ డీన్ డి శంకర్‌రావు, తల్లిదండ్రులు నీరజ, ఉమామహేశ్, గ్రాండ్ పేరెంట్స్ రాజేశ్వరి లింగమూర్తి ముదిగొండ, తాడంకి స్వరాజ్యలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి అష్టోత్తర శత కలషాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 9గంటలకు స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం, హారతి, ప్రసాద గోష్టిలు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు గరుడ వాహన సేవ, ఎదురుకోళ్లు, రాధాకృష్ణుల సాంస్కృతిక నృత్యాలు, రాత్రికి స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మంత్రోచ్చారణల మధ్య వేదపండితులు కల్యాణ ఘట్టాలను వివరించారు. డ్రీమ్ వ్యాలీ రిసార్ట్ ఎండీ సంతోష్‌రెడ్డి దంపతులు, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ దంపతులతో పాటు మంచిరేవుల గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం సహస్రనామ పుష్పార్చన, ఉంజల్‌సేవ, సాయంత్రం 6గంటలకు శేషవాహన సేవ, రథోత్సవం చేయనున్నారు.

చెరువులో వ్యర్థాల డంపింగ్



వట్టినాగులపల్లి గౌని చెరువులో పోసిన మట్టి

మణికొండ: చెరువు స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెరువు స్థలం కుంచించుకుపోతోంది. అర్ధరాత్రుళ్లు కొందరు ఇళ్లు, ఇతర వ్యర్థాలను ట్రాక్టర్లు, లారీల ద్వారా వట్టినాగులపల్లి గ్రామాన్ని ఆనుకుని ఉన్న గౌని చెరువులో డంపింగ్ చేస్తున్నారు. ఈ గ్రామం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందని, అధికారులు దీనివైపు పట్టించుకున్న పాపాన పోలేదని, పరిస్థితి ఇలానే కొనసాగితే చెరువు పూర్తిగా కుంచించుకుపోయి, వర్షాకాలం వచ్చే వరదకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సరైన డ్రెయిన్లు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

వర్షాకాలం వస్తే...

రానున్నది వర్షాకాలం కావడంతో చెరువు ఆక్రమణకు గురైతే వర్షం నీరు పోయేందుకు అవకాశం ఉండదని, దీంతో గ్రామంలోని ఇళ్లలోకి నీరుచేరే ప్రమాదం ఉందని, ముంపు పరిస్థితులు తలెత్తే అవకాశమూ లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాక్టర్‌లు, టిప్పర్ల యజమానులపై చర్యలు తీసుకుని చెరువును రక్షించాలని కోరుతున్నారు.

వ్యక్తి దారుణ హత్య

- ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలే కారణమా?
- ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ -258 హసన్‌నగర్ వద్ద ఘటన



మృతుడు లాహిఖ్ (ఫైల్)

అత్తాపూర్ : ఓ వ్యక్తిని గుర్తు తెలియని కొందరు వెంబడించి హత్యచేసిన ఘటన ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ -258 హసన్‌నగర్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ తూల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం.. లాల్ దాబా అసలునగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ లాహిఖ్(42) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శనివారం స్నేహితులతో కలిసి మద్యం సేవించి ఇంటికి తిరిగి వస్తే క్రమంలో రాత్రి 11:30 గంటల ప్రాంతంలో కొందరు వెంబడించారు. పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ -258 హసన్ నగర్ వెళ్లే దారిలో బీరు సీసాలు, పదునైనా కత్తులతో దాడి చేసి పారిపోయారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మహ్మద్ లాహిఖ్ అప్పటికే మృతి చెందడంతో శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తండ్రి, భార్యా, పిల్లలున్నారు. తండ్రి మహమ్మద్ మోహిన్ చాయ్ బండి నిర్వహిస్తాడు. పథకం ప్రకారమే అతని స్నేహితులు ఈ హత్య జరిగి ఉండొచ్చని, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కారణాలై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సెల్లార్ ప్రమాదాలకు చెక్..!

టౌన్ ప్లానింగ్ అధికారుల ముందస్తు చర్యలు

- 30 సెల్లార్ల యజమానులకు నోటీసులు జారీ
- జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేపట్టాలని సూచన
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- వర్షాకాలం ముగిసే వరకు నూతన సెల్లార్ తవ్వకాలకు బ్రేక్



గచ్చిబౌలిలో సెల్లార్‌ను పరిశీలిస్తున్న వెస్ట్ జోన్ సీపీ మల్లిఖార్జున్, శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీ మెప్రో

గచ్చిబౌలి: వర్షాకాలంలో తరచూ సెల్లార్ తవ్వకాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు భూమి నాని ఉండడంతో సెల్లార్ సెట్ బ్యాక్ ప్రాంతాలు ఒక్కసారిగా కుప్పకూలడంతో ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. దీంతో సెల్లార్ ప్రమాదాల నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో దాదాపు 30 సెల్లార్ల తవ్వకాల పనులు జరుగుతున్నట్లు గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారందరికీ నోటీసులు జారీ చేశారు. ఇందులో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోనే 20 సెల్లార్లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభమైన సెల్లార్ల యజమానులకు ఆయా సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ అధికారులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని నోటీసులు జారీ చేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సెల్లార్లు, సెట్ బ్యాక్ ప్రాంతంలో లేబర్ క్యాంపులు పెట్టద్దు.
- సెల్లార్ తవ్వకం పూర్తయిన తర్వాత సెట్ బ్యాక్ వైపు దరులు కూలకుండా చర్యలు చేపట్టాలి.
- రిటైనింగ్ వాల్స్ నిర్మించాలి.
- సెల్లార్ల చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలి.
- కూల్చిన శిథిలాలు, వ్యర్థాలు రీసైక్లింగ్ ప్లాంటుకు తరలించేలా చర్యలు తీసుకోవాలి.
- వరద సెల్లార్లలోకి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
- అనుమతి ప్రకారమే సెల్లార్ల తవ్వకాలు చేపట్టాలి.
- భూమి జారిపోవడం, కుంగిపోయే అవకాశం ఉన్న చోట నివాసం ఉంటున్న వారిని వేరో చోటికి తరలించాలి.
- సెల్లార్లలో ఊట నీరు వచ్చినా మోటార్ల ద్వార రోడ్లపైకి వదలవద్దు.
- తవ్వి వదిలేసిన సెల్లార్ల చుట్టూ ఫెన్సింగ్ వేయాలి.
- టౌన్ ప్లానింగ్ అధికారుల నోటీసులకు స్పందించకుంటే బిల్డర్ల లైసెన్స్ రద్దయ్యే అవకాశం ఉంటుంది.

12 శిథిల భవనాల గుర్తింపు..

వెస్ట్ జోనల్ పరిధిలో 12 శిథిల భవనాలు ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు వాటికి నోటీసులు జారీ చేశారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన 4 భవనాలను కూల్చివేయాలని సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చారు. మిగిలిన వాటిని పరిశీలిస్తున్నామని, మరమ్మతు లేదా కూల్చివేతలపై నిర్ణయం తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. శిథిల భవనంలో ఉన్నా, సమీపంలో నిలబడిన ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వర్షాకాలం ముగిసే వరకు నూతన సెల్లార్ల తవ్వకాలకు బ్రేక్..

వర్షాకాలం ముగిసే వరకు నూతన సెల్లార్ తవ్వకాలపై జీహెచ్‌ఎంసీ నిషేధం విధించింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి సెల్లార్ తవ్వకాలు చేపటితే సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని వెస్ట్ జోనల్ సీపీ మల్లిఖార్జున్ హెచ్చరించారు. ఇప్పటికే పనులు ప్రారంభమైన సెల్లార్ల తవ్వకాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో 30 సెల్లార్లను గుర్తించామని, సెల్లార్ నిర్మాణం చేపట్టే బిల్డర్లు, కాంట్రాక్టర్లు, యజమానులు తాము సూచించిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





శిథిల ఇండ్లను పరిశీలిస్తున్న వెస్ట్ జోన్ సీపీ మల్లిఖార్జున్, శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీ మెప్రో

అభివృద్ధికి సహకారం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఆర్‌ఐ ఆనంద్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం బీరంగూడలోని గోశాలను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, పాల్గొన్నారు.

అసదుద్దీన్‌కు మజ్లిస్ పార్టీ నాయకుల సన్మానం



అసదుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాజేంద్రనగర్: హైదరాబాద్ లోక్‌సభ సభ్యునిగా విజయం సాధించిన మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజేంద్రనగర్ నుండి ర్యాలీగా బయలుదేరి అసదుద్దీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి పునఃప్రారంభం

రాజేంద్రనగర్: స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కోడ్ ముగియడంతో పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ సర్కిల్ కార్యాలయంలోని మొదటి అంతస్తు మీటింగ్ హాల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీనికి జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది హాజరవుతారని తెలిపారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించాలని కోరారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అక్కడే ఉంటారని.. సమస్య పరిష్కారం కోసం వెంటనే తగు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.

ముగిసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఆర్థిక సేవల సంస్థ వెల్‌స్పన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన మెళకువలు కూడా అందించారు. అనంతరం పచ్చదనాన్ని పెంపొందించే క్రమంలో భాగంగా కార్పొరేట్ కంపెనీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా మొక్కలను నాటారు.



కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



చికిత్స పొందుతున్న రాజకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మోతీనగర్: కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురికాలనీకి చెందిన కొయ్యడ రాజకుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో గాయమై చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా... తాను పదవిలో ఉన్నా లేకున్నా తన కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు. కష్టం వచ్చినప్పుడు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చక్రపాణి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడాకారులను ప్రోత్సహించాలని బెల్ ఈడీ కేవీ.రాజా అన్నారు. శనివారం రాత్రి బెల్ కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో బెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. బెల్ క్రీడామైదానంలో ఆడిన అనేక మంది క్రీడాకారులు నేడు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారు. క్రీడాకారుల అభివృద్ధికి బెల్ యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బెల్ జీఎం చంద్రశేఖర్, అధికారులు సురేష్ ప్రసాద్, మాయబ్రహ్మం పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన హోంగార్డులు



హోంగార్డుల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ మనోహర్‌రెడ్డితో సభ్యులు

రాయదుర్గం: హోంగార్డుల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని రాష్ట్ర హోంగార్డుల అసోసియేషన్ సభ్యులు గచ్చిబౌలిలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే హోంగార్డుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా మనోహర్‌రెడ్డి స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఇదిలాఉంటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ జన్మదినం కావడంలో మనోహర్‌రెడ్డి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంగార్డుల వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొత్వాల్ దయానంద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహ్మద్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



సుపమరాణి నాథ్

గచ్చిబౌలి: వివాహిత అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం .. అసోం రాష్ట్రంలోని, హైలగంది జిల్లా చండీపూర్‌కు చెందిన కిషన్ మాల్, సుపమరాణి నాథ్ (22) దంపతులు జీవనోపాధి కోసం గచ్చిబౌలికి వలస వచ్చారు. కిషన్ సికింద్రాబాద్‌లో, భార్య గచ్చిబౌలిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 8 గంటలకు ఇద్దరు డ్యూటీకి వెళ్లారు. కిషన్ మాత్రం ఆ రోజు విధుల్లోనే ఉండగా భార్య ఇంటికి వచ్చానని భర్తకు ఫోన్ చేసి చెప్పింది. 8 వ తేదీన రాత్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో భర్త ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. డ్యూటీ చేసే చోటికి వెళ్లి ఆరా తీయగా రెండు రోజుల నుంచి విధులకు రావడం లేదని తెలిపారు. దీంతో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక..



వసంత

మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మియాపూర్‌లోని నడిగడ్డతండాకు చెందిన బానోత్ నరేశ్ కూతురు వసంత(13)స్థానికంగా ఏడో తరగతి చదువుతోంది. ఈ నెల 7వ తేదీన ఉదయం 7 గంటలకు తండ్రి నరేశ్ వసంతను చదువుకోవాలని మందలించాడు. అనంతరం భార్యతో కలిసి పనికి వెళ్లిపోయాడు. 9.30 ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా కూతురు వసంత కనిపించలేదు. చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నరేశ్ మియపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సాయినగర్‌కాలనీకి చెందిన వ్యక్తి..



సింహాచలం

మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హాఫీజ్‌పేట సాయినగర్ కాలనీకి చెందిన సింహాచలం (58) ఈ నెల 7వ తేదీన ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'నీట్' ర్యాంకర్ సౌమ్యకు సన్మానం



సౌమ్యను సన్మానించిన దృశ్యం

శంషాబాద్: పట్టణంలోని ఊట్‌పల్లికి చెందిన నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్తయ్య, లలిత దంపతుల కుమార్తె తోట్ల సౌమ్య ఇటీవల నీట్‌లో ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయిలో 36 వేల ర్యాంకును తెచ్చుకున్న సందర్భంగా సత్తయ్య స్నేహితులు, కుటంబసభ్యులు, స్థానికులు విద్యార్థినిని సన్మానించి అభినందించారు. విజయవంతంగా అత్యున్నత చదువులు పూర్తి చేయాలని అకాంక్షించారు.

ఐఐటీలో గిరిజన బాలుర జయకేతనం



బి. చందులాల్



బి భద్ర

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడి సెంటర్ విద్యార్థులు ఐఐటి, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో తమ సత్తాచాటారు. కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పరీక్ష రాయగా ఇందులో 50 మంది విద్యార్థులు ఐఐటి ర్యాంకులు సాధించి జయకేతనం ఎగురవేశారు. వీరిలో బి చందులాల్ 291వ ర్యాంకు, బి భద్ర 295వ ర్యాంకు, కే వినోద్ 338, జి హర్షి 625వ ర్యాంకు, బి తరుణ్ 626వ ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు 12 మంది ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, గురుకుల ఉన్నతాధికారులు విద్యార్థులను అభినందించారు.

'శ్రీనికేతన్' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్ రాంబాగ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనికేతన్ హై స్కూల్ రాంబాగ్‌లో 2004-2005 బ్యాచ్ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులంతా 20 సంవత్సరాల తరువాత కలవడం ఆనందకరంగా అనిపించింది. అదే విధంగా విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత తమ విద్యార్థులను కలవడం, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రొఫెషనలో సెటిల్ కావడంతో ఉపాధ్యాయులు ఆనందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం



మోతీనగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం కార్యక్రమం వివేకానందనగర్ విగ్రహం వద్ద హిందూ వాహిని కూకట్‌పల్లి బాగ్ కన్వీనర్ సీహెచ్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీహెచ్. వెంకట్రాంరెడ్డి, డి.రాంగోపాలసింగ్, జి.రాజు, పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్, జి.సుదర్శన్, లాల్‌సింగ్, గంగాధర్, రాకేష్ యాదవ్, జితు, సందీప్‌నాయక్, నవీన్, వెంకటరెడ్డి, మురళీ మోహన్, అంకిత్‌సింగ్, రాజకుమార్ పాల్గొన్నారు.